

## ప్రేమ 'గుడ్డి'ది...

ప్రేమ గుడ్డిది అన్న ఓ కవి మాటలు ఈ అంధ జంట పాలిట అక్షరసత్యం అయింది. 20సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్న ఓ అంధ జంట ఇటీవలే ఓ ఇంటి వారయ్యారు. కేరళలోని ఏర్నాకుళం జిల్లాలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు..

కృష్ణమూర్తి(42), ధనకమ్మా గత 20 సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. కాలేజీలో చదువుకుంటున్నప్పటి నుంచి వారిద్దరికీ పరిచయం ఉంది. ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. ప్రభుత్వోద్యోగాలు వచ్చి, జీవితంలో స్థిరపడిన తరువాతే వివాహం చేసుకోవాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా వారుకోరుకున్న ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదు. కేవలం ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా కృష్ణమూర్తి ఓ చిన్న వ్యాపారాన్ని అభివృద్ధి చేశాడు. తాము కోరుకున్న ఉద్యోగం రాకపోయినా కష్టపడకుండా జీవించగలమన్న నమ్మకం ఇప్పుడు కలగడంతో ఇన్ని సంవత్సరాల తరువాత ఓ ఇంటి వారమయ్యామని కృష్ణమూర్తి తెలిపారు. చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాన్వేషణ చేస్తూనే వేరుశనగపప్పుల వ్యాపారం ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఆ వ్యాపారంలో ఇప్పుడు బాగా నిలదొక్కుకోగలిగానని, కుటుంబ నిర్వహణకు కావలిసినంత డబ్బు సంపాదించగలనన్న నమ్మకం ఇప్పుడు క లిగిందని ఆయన వివరించారు. ఇన్ని సంవత్సరాలకి స్థానిక లయన్స్‌క్లబ్ వారు నిర్వహించిన ఉమ్మడి కళ్యాణ వేదిక మీద వీరిద్దరూ దంపతులయ్యారు.

## స్కూలు విద్యార్థుల రికార్డు బ్రేక్...



రకరకాల పద్ధతుల్లో రికార్డులు బద్దలుకొడుతుంటారు. ఈ పిల్లకాయలు మాత్రం ఏకధాటిగా 27 గంటలపాటు డ్రమ్స్ వాయించి రికార్డు సాధించారు.న్యూ ఢిల్లీలోని రాక్‌హిల్ హైస్కూలుకు చెందిన కొందరు విద్యార్థులు ఈ ఘనత సాధించారు. వీరికి 27 మంది వాయిద్యకారులు వాయిద్య సహకారాన్ని అందించారు. ఇందుకోసం 3,600 డాలర్లు వెచ్చించి కొత్త పరికరాల్ని తెప్పించినట్లు స్కూలు యాజమాన్యం తెలిపింది. తమ స్కూలు విద్యార్థులు సాధించిన ఈ విజయం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని యాజమాన్యం పేర్కొంది. విద్యార్థులందరూ కలిసి ఈ విజయం సాధించగా ఒక విద్యార్థి వ్యక్తిగతంగా రికార్డు నెలకొల్పినట్లు తెలిపారు. ఈ విద్యార్థి పేరు కూడా గిన్నీస్ బుక్ వారికి ప్రత్యేకంగా పంపినట్లు వారు తెలియజేశారు.

'సరసి'కత

వైశంపాయనుడు తరచుగా రాత్రిపూట లేటుగా ఇంటికి రావడం, అతని వద్ద ఏదో కొత్త వాసన రావడం వంటివి మూడుసార్లు గమనించేక, వైశంపాయనుడు కాస్తా 'వ్యసనం పాయనుడు' అవుతున్నాడేమోనని భయపడింది భార్య సుబ్బాయమ్మ.

ఆ మర్నాడు ఓ కథ చెప్పిందావిడ.

"గోదావరికి వరదొచ్చినపుడు ఆ నీళ్లలో చెత్తా చెదారంతో బాటు కలప కూడా కొట్టుకొస్తూ వుంటుంది పైనించి. గజ ఈతగాళ్లు నీళ్లలోకి దూకి ఆ కలపని ఒడ్డుకు తెచ్చుకుని అమ్ముకుంటూ వుంటారు.

ఒకసారి ఈతగాడొకడు గోదావరిలో కాస్తంత దూరంలో నల్ల చేవ దుంగ



# వ్యసనంపాయనుడు

ఒకటి కొట్టుకు రావడం గమనించి, అమాంతం నీళ్లల్లోకి దూకి దాన్ని పట్టుకున్నాడు. అయితే అతగాడు ఎంతకీ ఒడ్డుకి రాకపోవడంతో 'రారా తొరగా' అని గట్టిగా కేకలు పెట్టేరు ఒడ్డునున్న అతగాడి మనుష్యులు. 'నేను రాలేన్రా. ఇది దుంగ కాదు. ఎలుగుబంటి! నేను వదిలినా అది నన్ను పట్టుకుని వదలటం లేదు. నన్నింక మరిచిపోండి!' అంటూ నీళ్లల్లో కొట్టుకు పోయాడు" కథ ముగించి, "ముందు కావాలనే అతడు దానిని పట్టుకున్నాడు. తర్వాత అది వాడిని పట్టుకుంది. దరిమిలా దానిని అతడు వదిలించుకుందామనుకున్నా, అది వాడిని వదల లేదు" అంది సుబ్బాయమ్మ గారు.

"వ్యసనాలు కూడా అటువంటివే. ముందు వాటిని సరదాగా మనం అలవాటు చేసుకుంటాము, తర్వాత, వాటి వల్ల నష్టాలు తెలిసేక వదులుకుందామనుకున్నా అవి మనల్ని వదలవు!" అందామె మళ్లీ, ముక్తాయింపుగా.

ఆ రోజు తర్వాత వైశంపాయనుడెప్పుడూ ఇంటికి లేటుగా రాలేదు, అతని వద్ద ఆ వాసనా రాలేదు!

*